సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం । 28 । మార్చి । 2023



అర్జీలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

స్పందన కార్యక్రమంలో ప్రజలిచ్చే అర్జీలపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చక్రధర్‌బాబు హెచ్చరించారు. సోమవారం ప్రజల నుంచి అధికారులు వినతులు స్వీకరించారు. 8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.61,100
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,457
3 శాతం జీఎస్టీతో	రూ.5,621
సవర (8 గ్రా)	రూ.44,968

గరిష్టం/కనిష్టం
36.6 /26.5

వాతావరణం

సోమవారం గాలిలో 64 శాతం తేమ ఉంది. మంగళవారం ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశముంది. ఉక్కపోత అధికంగా ఉంటుంది.



న్యూస్‌రీల్

పంజాబ్ యువకుల సైకిల్ యాత్ర



మాట్లాడుతున్న యువకులు

మనుబోలు: పంజాబ్‌కు చెందిన యువకులు భూపేందర్ సింగ్, వికాస్ సింగ్ తలపెట్టిన సైకిల్‌పై భారతదేశ యాత్ర సోమవారం మనుబోలుకు చేరుకుంది. స్థానిక బైపాస్ వద్ద వారు మీడియాతో మాట్లాడారు. దేశంలోని వివిధ రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయాలు, ఆహారపు అలవాట్లు తెలుసుకునేందుకు 2022 సంవత్సరం సెప్టెంబర్ నెలలో పంజాబ్‌లోని లూధియానా నుంచి సైకిల్ యాత్రను మొదలుపెట్టామన్నారు. గుజరాత్, ముంబై, పుణే, గోవా, బెంగళూరు, కన్యాకుమారి, చెన్నై మీదుగా ఇప్పటి వరకూ సుమారు నాలుగు వేల కిలోమీటర్ల యాత్ర చేశామన్నారు. రోజుకు 60 నుంచి 100 కిలోమీర్లు తిరుగుతున్నామని, 2024 జనవరి నాటికి కశ్మీర్‌లో ముగిస్తామని తెలిపారు.

8,189 పొగాకు బేళ్ల విక్రయం



డీసీపల్లి వేలం కేంద్రంలో బేళ్లు

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రానికి సోమవారం 922 గానూ 908 బేళ్లను కొనుగోలు చేశారని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. మిగిలిన వాటిలో 5 నోసేల్, 4 నోబిడ్, 5 సీఆర్‌గా గుర్తించారు. 1,22,720 కిలోల పొగాకు విక్రయించగా రూ.2,42,44,980ల వ్యాపారం జరిగింది. ఒక కిలోకు గరిష్టంగా రూ.200, కనిష్టంగా రూ.185, సగటున రూ.197.56 ధర లభించింది. వేలంలో 8 కంపెనీలు పాల్గొన్నాయి.

- కలిగిరి: కలిగిరి పొగాకు వేలం కేంద్రంలో సోమవారం జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 7,804 బేళ్లను అమ్మకానికి తీసుకురాగా 7,281 బేళ్లను కొనుగోలు చేశారని 384 బేళ్లను తిరస్కరించారని వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు. కిలో పొగాకుకు గరిష్టంగా రూ.200, కనిష్టంగా రూ.155, సగటున రూ.197.32 ధర లభించింది. వేలంలో 8 కంపెనీలు పాల్గొన్నాయి.

కామాక్షితాయికి వెండి పళ్లెం బహూకరణ



వెండి పళ్లెం అందజేస్తున్న ఆలయ చైర్మన్ సుబ్రహ్మణ్యంనాయుడు దంపతులు

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి ఆలయానికి ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, లక్ష్మీకాంతమ్మ దంపతులు దాదాపు 1.570 కేజీల వెండి పళ్లేన్ని సోమవారం బహూకరించారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు నందకుమార్, రఘురామయ్య, విమల, శివకుమార్, అర్చకులు పాల్గొన్నారు.

షుగర్‌లెస్ వరి జోరు

వరి సాగుకు సింహపురి పెట్టింది పేరు. జలాశయాల ద్వారా నీరందుతుండడం.. వర్షాలు సకాలంలో కురవడం.. తదితర కారణాలతో ఇక్కడి రైతులు ప్రధానంగా వరిపైనే ఆధారపడ్డారు. ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకాన్ని సాగు చేస్తుంటారు. ప్రస్తుతం అధికంగా షుగర్‌లెస్ (తెలంగాణ సోనా మసూరి) వరి సాగును చేపట్టారు. ధరలు కూడా బాగుండడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో రికార్డు స్థాయిలో సాగు చేసిన రైతులు

- పుట్టి (847 కిలోలు) ధాన్యం రూ.20 వేలు
- మునుపెన్నడూ లేని ధరలు
- కల్లాల్లోనే మిల్లర్ల కొనుగోలు



కోతకు వచ్చిన షుగర్‌లెస్ వరి రకం

జిల్లాలో..

రబీలో సాగు విస్తీర్ణం : 3,80,100 ఎకరాలు

షుగర్‌లెస్ (తెలంగాణ ఆర్ఎన్ఆర్ 15048) : 2,08,000 ఎకరాలు

టీజే (తీరవ జాస్తి ఆయకట్టు) : సుమారు 25,000 ఎకరాలు

పొదలకూరు: జిల్లాలో ఈ రబీ సీజన్‌లో చేపట్టిన తెలంగాణ ఆర్ఎన్ఆర్ (రాజేంద్రనగర్) వరి సాగు రైతులకు వరంగా మారింది. పుట్టి ధాన్యం రూ.20 వేలకు మిల్లర్లు తీసుకెళ్తున్నారు. అయితే అకాల వర్షానికి స్వల్పంగా తడిసిన ధాన్యాన్ని కూడా మిల్లర్లే కొద్దిపాటి ధర తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. గతేడాది ఇదే సమయంలో షుగర్‌లెస్ ధాన్యం రూ.15 వేల నుంచి రూ.15,500 మాత్రమే ధర పలికింది. మిగిలిన ఎన్ఎల్ఆర్ 34449 సాగు వల్ల రైతులు నష్టపోయారు. అయితే ఈ పర్యాయం ఆ పరిస్థితులు రాకుండా అధిక శాతం రైతులు షుగర్‌లెస్ రకాన్ని పండించారు.



తేమశాతం తగ్గించేందుకు ధాన్యాన్ని ఆరబోసిన రైతులు

విదేశాలకు ఎగుమతి

షుగర్‌లెస్ ధాన్యానికి విదేశాల్లో మంచి డిమాండ్ ఉంది. ఈ రకం బియ్యం షుగర్ వ్యాధిగ్రస్తులకు మంచిదిగా వైద్యులు వెల్లడిస్తున్నారు. గ్లూకోజ్ శాతం తక్కువగా ఉండడం.. ప్రోటీన్స్ లభిస్తుండడంతో ఆరోగ్యానికి ఎలాంటి హానికరం కాదని, చక్కెర వ్యాధి ఉన్నవారు లక్షణంగా భోజనం చేయొచ్చని చెబుతున్నారు. ఫలితంగా షుగర్‌లెస్ ధాన్యానికి గిరాకీ పెరిగింది. చెన్నైకి చెందిన వ్యాపారులు ఈ ప్రాంతానికి వచ్చి రైతుల వద్ద కల్లాల్లోనే తెలంగాణ మసూరీని పోటీపడి కొనుగోలు చేస్తున్నారు. చెన్నై రెడ్‌హిల్స్ ప్రాంతానికి ప్రతినిత్యం జిల్లా నుంచి పదుల సంఖ్యలో ధాన్యం లారీలు తరలివెళ్తున్నాయి.



అకాల వర్షం వల్ల నష్టం

కొద్దిరోజుల క్రితం కురిసిన అకాల వర్షం వల్ల జిల్లాలో కొన్ని మండలాల్లో వరిసాగుకు నష్టం వాటిల్లింది. ఇందులో తెలంగాణ మసూరి రకం కూడా ఉంది. దీంతో కోతల దశలో ధాన్యం స్వల్పంగా రాలి తడిసిపోవడంతో రంగు మారింది. ఫలితంగా మిల్లర్లు పుట్టికి రూ.2 వేలు తగ్గించి కొనుగోలు చేస్తున్నట్టు రైతులు వెల్లడించారు.

పెరుగుతున్న సాగు విస్తీర్ణం

జిల్లాలో ప్రతి ఏడాది తెలంగాణ సోనా మసూరి సాగు విస్తీర్ణం పెరుగుతోందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఈ రకం వేస్తే 125 రోజులకు దిగుబడి వస్తుంది. మిగిలిన రకాలతో పోల్చి చూస్తే రైతులకు లాభాలు వస్తుండడంతో షుగర్‌లెస్ వరి సాగుకు మక్కువ చూపుతున్నారు. మార్టేరు క్రితం జిల్లాలో రైతులు అధికంగా బీపీటీ 5204, ఎన్ఎల్ఆర్ 34449 (నెల్లూరు మసూరి), ఎంటీయూ 1262, కేఎన్ఎం 1638 వరి రకాలను అధికంగా సాగు చేసేవారు. ఇప్పుడు తెలంగాణ మసూరి రకాన్ని 60 శాతం వరకు సాగు చేస్తున్నారని అంచనా. అంతేకాక ఈ రకం వరి అన్నదాతలకు మినిమం గ్యారెంటీగా మారింది. ఎకరానికి 3 నుంచి 3.5 పుట్ల ధాన్యం దిగుబడి కూడా అవుతుంది. తక్కువలో తక్కువ ధర ఉన్నా రూ.16 వేల వరకు గిట్టుబాటు అవుతోంది. గతేడాది కొన్ని రకాల పంటల ధరలు దిగజారిపోగా ఒక్క షుగర్‌లెస్సే రూ.15 వేల వరకు ధర పలికింది. దీంతో రైతులు సాగు విస్తీర్ణాన్ని పెంచుకున్నారు. పొదలకూరు మండలంలో 10,500 ఎకరాల్లో వరిసాగు చేశారు. అందులో 4 వేల ఎకరాల్లో షుగర్‌లెస్ రకాన్ని పండించారు.

ఊహించని ధరలు



రైతులు ఊహించని ధరలు తెలంగాణ మసూరి రకానికి లభ్యమవుతుండం సంతోషంగా ఉంది. ఈ ధరలు ఇలాగే ఉంటే ఎకరాకు రైతుకు రూ.30 వేల వరకు మిగిలే అవకాశం ఉంటుంది. దిగుబడి కూడా ఆశించిన స్థాయిలో ఉంది. ఇది మంచి పరిణామంగా రైతులు చెబుతున్నారు.

– ఆర్.సుబ్బరామిరెడ్డి, రైతు, తాటిపర్తి

విస్తీర్ణం పెరిగింది



తెలంగాణ మసూరి రకానికి డిమాండ్ ఉండడంతో మిల్లర్లు పుట్టికి రూ.20 వేలు చెల్లించి కల్లాల్లోనే కొనుగోలు చేస్తున్నారు. గతంలో ఆర్ఎన్ఆర్ 15048 రకం సాగు గురించి ఈ ప్రాంతం రైతులకు అవగాహన లేదు. ధరలు బాగా లభిస్తుండడంతో సాగు విస్తీర్ణం పెరిగింది.

– ఎస్.రామలింగారెడ్డి, రైతు, దేగపూడి

మక్కువ చూపుతున్న రైతులు



జిల్లాలో షుగర్‌లెస్ సాగు విస్తీర్ణం పెరుగుతోంది. గతేడాదికి ఇప్పటికీ విస్తీర్ణం పెరిగినట్టుగా లెక్కలు చెబుతున్నాయి. సాగులో చీడపీడలు నివారణ కూడా మిగిలిన వరి రకం వలె ఉండడంతో రైతులకు యాజమాన్య పద్ధతులు ప్రత్యేకంగా ఉండవు. దీంతో తెలంగాణ మసూరి సాగుపై మక్కువ చూపుతున్నారు.

– ఎ.వాసు, ఏఓ, పొదలకూరు

ధాన్యానికి రికార్డు స్థాయి ధర

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



పోలంరాజుగుంటలో మహిళకు బుక్‌లెట్ అందజేస్తున్న మంత్రి గోవర్ధన్‌రెడ్డి

ముత్తుకూరు: వరి ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే రికార్డు స్థాయిలో ధర లభిస్తోందని రాష్ట్ర వ్యవసాయ – సహకార శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పోలంరాజుగుంట పంచాయతీలో సోమవారం సాయంత్రం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రజలతో మాట్లాడి సంక్షేమ పథకాలు పక్కాగా అందాయా? లేదా? అని ఆరాతీశారు. బుక్‌లెట్లు పంపిణీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ప్రస్తుతం వరి ధాన్యం పుట్టి రూ.18,000 వరకు పలుకుతోందన్నారు. దీంతో రైతులు చాలా సంతోషంగా ఉన్నారని చెప్పారు. ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు దెబ్బతింటాయని ప్రతిపక్షాలు ఎన్నో ఆశలు పెట్టుకొన్నాయని చమత్కరించారు. అయితే భగవంతుడి చల్లని చూపు వల్ల రైతులకు ఎటువంటి నష్టం కలగలేదన్నారు. అన్నదాతల సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు.

ప్రారంభోత్సవాలు

దువ్వూరువారిపాళెం సమీపంలో రూ.1.17 కోట్లతో చుట్టుగుంట – పచ్చికాయలమిట్ట వరకు నిర్మించిన సీసీ, బీటీ రోడ్డును, చుట్టుగుంట వద్ద శ్మశానవాటికను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, చంద్రబాబు కరువు కవలపిల్లలని ఎద్దేవా చేశారు. రోడ్ల నిర్మాణం వల్ల భూముల ధరలు కూడా పెరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రత్యూష, తహసీల్దార్ మనోహర్‌బాబు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మెట్ట విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీపీ గండవరం సుగుణ, మండల ఉపాధ్యక్షుడు పోలిరెడ్డి చిన్నపరెడ్డి, వల్లూరు, పోలంరాజుగుంట సర్పంచ్‌లు పెంచల ప్రతాప్, దువ్వూరు హారిక, నాయకులు దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి, దువ్వూరు విజయభాస్కర్‌రెడ్డి, దువ్వూరు కోదండరామరెడ్డి, దువ్వూరు సుబ్బరామరెడ్డి పాల్గొన్నారు.

వైద్యరంగానికి అధిక ప్రాధాన్యం

- కలెక్టర్ చక్రధర్‌బాబు
- జిల్లాకు ఏడు కొత్త 104 వాహనాలు
- ప్రారంభించిన కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ



వాహనాలను ప్రారంభిస్తున్న కలెక్టర్ చక్రధర్‌బాబు, చైర్‌పర్సన్ అరుణమ్మ

నెల్లూరు(పొగతోట): పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం వైద్యరంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు అన్నారు. ప్రభుత్వం జిల్లాకు ఏడు కొత్త 104 వాహనాలను అందజేసింది. వాటిని నెల్లూరులోని జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ప్రజలకు అత్యవసర, నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు 104, 108 వాహనాలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. వాటి వల్ల గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సేవలు సకాలంలో అందుతున్నాయన్నారు. ఇతర రాష్ట్రాల్లో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో వైద్యరంగంలో అనేక సంస్కరణలు సమర్థవంతంగా అమలవుతున్నట్లు చెప్పారు. విలేజ్ క్లినిక్స్, ఫ్యామిలీ డాక్టర్ అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు. ప్రజల వద్దకే వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని వైద్యసేవలు అందిస్తున్నారని తెలిపారు. ప్రాథమిక, కమ్యూనిటీ, ఏరియా, జిల్లా హాస్పిటల్స్‌లో వైద్యుల పోస్టులు భర్తీ చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. అరుణమ్మ మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో సైతం మెరుగైన వైద్యం అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 104 వాహనాలు 37 ప్రజలకు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. మరో ఏడు నూతన వాహనాలను కేటాయించడంపై ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ బి.చిరంజీవి, డీఎంహెచ్ఓ పెంచలయ్య, 104, 108 అంబులెన్స్‌ల జిల్లా మేనేజర్ పవన్ తదితరులు పాల్గొన్నారు.

గిరిధర్‌రెడ్డి రాక.. టీడీపీలో చిచ్చు

- తెలుగు తమ్ముళ్ల మధ్య విభేదాలు
- అలకబూనిన సీనియర్లు
- చంద్రబాబును కలిసిన పలువురు నాయకులు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి చేరిక తెలుగుదేశంలో కొత్త సమస్యలు తెచ్చింది. ఆయన్ను టీడీపీలోకి ఆహ్వానించడాన్ని వ్యతిరేకించినా పట్టించుకోకుండా చేర్చుకోవడంతో వర్గాల మధ్య విభేదాలు మరింత పెరిగాయి. గిరి చేరిక కార్యక్రమానికి పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, జిల్లాలో సీనియర్ నేత అయిన సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు, నెల్లూరు రూరల్ ఇన్‌చార్జి అబ్దుల్ అజీజ్‌తో పాటు సీనియర్లు హాజరుకాకపోవడం చూస్తే ఆ పార్టీలో పరిస్థితి ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది.

అన్నీ తానై..

జిల్లాలో లోకేశ్ టీంగా ప్రస్తుతం వ్యవహారాలు నడిపిస్తున్న మాజీ మంత్రి నారాయణ ముఖ్య అనుచరుడు పట్టాభి టీడీపీలోకి గిరిధర్‌రెడ్డి చేరిక విషయంలో అన్నీ తానై వ్యవహరించాడు. పార్టీ జిల్లా అధ్యక్షుడికే వ్యతిరేకంగా అంతర్గత విషయాల్లో పట్టాభి తలదూర్చడంపై కూడా సీనియర్లు గుర్రుమంటున్నారు. ఆయన గురించి నారాయణ వద్ద తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమయ్యారు. ఈ విషయంలో పంచాయితీ కూడా పెట్టినట్లు ప్రచారం జరుగుతోంది.

ఎంట్రీకి ముందే ఫ్లెక్సీ వివాదం

గిరిధర్‌రెడ్డి టీడీపీలో చేరికకు ముందే ఫ్లెక్సీల వివాదం మొదలైంది. కోటంరెడ్డి బ్రదర్స్ నగరంలో ఏర్పాటు చేయించిన ఫ్లెక్సీల్లో ఎక్కడా జిల్లాలోని సీనియర్ నేతల ఫొటోలు వేయలేదు. కేవలం చంద్రబాబు, లోకేశ్, బాలకృష్ణ ఫొటోలు మాత్రమే పెట్టారు. సీనియర్ నేతలు లేకపోవడంతో ఆ పార్టీ కార్యకర్తలు నోరెళ్లబెట్టారు.

ఇప్పటికే..

రానున్న ఎన్నికల్లో జిల్లాలో లోకేశ్ వర్గంగా చెప్పుకునే కొత్త ముఖాలే బరిలో ఉంటాయని చెబుతున్నారు. గతంలో పలుసార్లు పోటీ చేసి ఓటమి పాలైన వారిని పక్కన పక్కకు తప్పించేయత్నం జరుగుతున్నట్లు సమాచారం. దీంతో తమకు అవకాశం వస్తుందో రాదో తెలియక సీనియర్లు ఆందోళనలో ఉన్నారు. దీనికితోడు కోటంరెడ్డి బ్రదర్స్ విషయంలో వారి మాటను పట్టించుకోకపోవడంతో బాధలో మునిగిపోయారు.

- సోమవారం టీడీపీ సీనియర్ నాయకులు బీద రవిచంద్ర, నారాయణ, అబ్దుల్ అజీజ్ చంద్రబాబును హైదరాబాద్‌లో కలిశారు. ఈ పరిణామాలు ఇలా ఉండగానే గిరిధర్‌రెడ్డిని చినబాబు వర్గం యువగళం పాదయాత్రకు తీసుకెళ్లింది. ప్రత్యేకంగా లోకేశ్‌ను కలిపించడంతో సీనియర్లకు పుండు మీద కారం చల్లినట్లయింది.

కీలకంగా చినబాబు వర్గం

కోటంరెడ్డి బ్రదర్స్ వ్యవహారశైలి తెలిసిన టీడీపీ సీనియర్ నేతలు ఆది నుంచి వారిని పార్టీలోకి ఆహ్వానించడాన్ని వ్యతిరేకిస్తూ వచ్చారు. ఎమ్మెల్యేగా రెండు దఫాలు అవకాశం కల్పించిన వైఎస్సార్‌సీపీకి వెన్నుపోటు పొడిచిన శ్రీధర్‌రెడ్డిని అక్కున చేర్చుకుంటే టీడీపీలో అదే సీన్ రిపీట్ చేయరని నమ్మకం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. నెల్లూరు సిటీ, రూరల్ నియోజకవర్గాల్లో టీడీపీ నాయకులను టార్గెట్ చేసి ముప్పుతిప్పలు పెట్టడమే కాకుండా ఆర్థిక మూలాలపై దెబ్బకొట్టిన బ్రదర్స్‌ను సీనియర్, ద్వితీయ శ్రేణి నాయకులు వ్యతిరేకిస్తూ వచ్చారు. టీడీపీ అధికారంలో ఉన్నా, లేకున్నా కష్టపడిన వారి మాటను తోసిపుచ్చి కేవలం ఒక ఎమ్మెల్సీ ఓటు కోసం వారికి ఎంట్రీ ఇవ్వడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. దీంతోనే గిరి జాయినింగ్ కార్యక్రమానికి టీడీపీ కార్యకర్తలు ఎవరూ వెళ్లొద్దని సీనియర్ నేతలు హుకుం జారీ చేశారు. చాలావరకు టీడీపీ కార్యకర్తలు వెళ్లకపోవడంతో రోజువారీ పనులు చేసుకునే వారికి కోటంరెడ్డి బ్రదర్స్ రూ.500 చొప్పున పంపిణీ చేసి కార్యకర్తలుగా చూపించినట్లు నాయకులే చెబుతున్నారు.

సోమశిలలో 55.135 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో సోమవారం సాయంత్రానికి 55.135 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 371 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. పెన్నార్ డెల్టాకు 700, ఉత్తరకాలువకు 403, దక్షిణకాలువకు 50, కండలేరుకు 300 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 97.228 మీటర్ల నీటి మట్టం నమోదైంది. సగటున 318 క్యూసెక్కుల నీరు ఆవిరి రూపంలో వృథా అవుతోంది.



సోమశిల జలాశయం (ఫైల్)

28 మంది ఏఎన్ఎంలకు స్థాన చలనం



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ పెంచలయ్య



హాజరైన ఏఎన్ఎంలు

నెల్లూరు(అర్బన్): జిల్లా వైద్యారోగ్య శాఖలో పనిచేస్తున్న 28 మంది ఏఎన్ఎంలను బదిలీ చేశారు. ఉమ్మడి జిల్లా పరిధిలో సర్‌ప్లస్ ఉన్న 147 మంది రెగ్యులర్ ఏఎన్ఎంలకు సోమవారం నెల్లూరులోని సంతపేటలో ఉన్న డీఎంహెచ్ఓ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. వారిలో సీనియారిటీ ప్రాతిపదికన కోరుకున్న అర్బన్ హెల్త్ సెంటర్లకు 28 మందిని బదిలీ చేశారు. నెల్లూరులోని అర్బన్ హెల్త్ సెంటర్లకు ఇద్దరు, గూడూరు అర్బన్ హెల్త్ సెంటర్లకు పదిమంది, వెంకటగిరి అర్బన్ హెల్త్ సెంటర్లకు ఆరుగురు, సూళ్లూరుపేటకు నలుగురు, కావలికి నలుగురు, బుచ్చిరెడ్డిపాళేనికి ఒకరు, నాయుడుపేటకు ఒకరిని కేటాయించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ పెంచలయ్య మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు రీ డిప్లాయ్‌మెంట్ (సర్దుబాటు) కింద బదిలీ చేస్తున్నామన్నారు. త్వరలోనే మరిన్ని బదిలీలు జరిగే అవకాశం ఉందన్నారు.

రెడ్‌క్రాస్ ఎన్నికల బరిలో 34 మంది

నెల్లూరు(అర్బన్): రెడ్‌క్రాస్ ఎన్నికల బరిలో ఎంతమంది ఉంటారో తేలింది. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఎన్నికల్లో పాల్గొనేందుకు 57 మంది నామినేషన్ దాఖలు చేశారు. అందులో విత్‌డ్రాలు పోను ఆదివారం రాత్రికి 49 మంది తేలారు. అయితే కలెక్టర్ చక్రధర్‌బాబు సోమవారం సైతం విత్‌డ్రాలకు అవకాశం కల్పించారు. సాధ్యమైనంత వరకు ఐకమత్యంగా రాజీ మార్గంలో పయనించాలని సూచించారు. దీంతో మాజీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, కమిటీ సభ్యులు పోటీ చేసిన వారందరితో ఉదయం నుంచి రాత్రి వరకు చర్చలు జరిపారు. ఫలితంగా మరి కొంతమంది విత్‌డ్రా చేసుకున్నారు. ఆఖరికి 34 మంది బరిలో ఉన్నారు. వీరిలో కొంతమంది సీక్రెట్ బ్యాలెట్ పద్ధతిని నిర్వహించాలని, మరికొందరు చేతులెత్తి సభ్యులను ఎన్నుకునే విధానాన్ని అనుసరించాలని కోరారు. అయితే సీక్రెట్ బ్యాలెట్ ప్రకారమే పోలింగ్ జరుగుతుందని ఎన్నికల అధికారి తిరుపాల్‌రెడ్డి ప్రకటించారు. వచ్చే నెల 2వ తేదీన ఎన్నికలు, 3న కౌంటింగ్ నిర్వహిస్తారు.

యువతకు భవిత

నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించి వారి బంగారు భవితకు బాటలు వేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లాలో మొత్తం ఎంతమంది నిరుద్యోగులు ఉన్నారో గుర్తించి వారి అర్హత ఆధారంగా శిక్షణ ఇచ్చేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. యువతకు శిక్షణ ఇచ్చి పరిశ్రమల్లో ఉద్యోగాలు పొందేలా తీర్చిదిద్దుతున్నారు. పరిశ్రమల్లో వృత్తినైపుణ్యం గల వారి కొరత ఉన్న నేపథ్యంలో నిరుద్యోగులకు మంచి అవకాశాలు లభిస్తున్నాయి.

- నిరుద్యోగులకు ఉచిత శిక్షణ, ఉద్యోగావకాశాలు
- శిక్షణ సమయంలో వసతి, భోజన సౌకర్యాలు
- పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు
- జాబ్‌మేళాలు నిర్వహించి ఉద్యోగాల కల్పన



వెంకటాచలంలోని శిక్షణ కేంద్రంలో నిరుద్యోగులకు సూచనలిస్తున్న జేడీఎం హైమావతి (ఫైల్)

జిల్లాలో..

2019 నుంచి ఇప్పటివరకు శిక్షణ పొందిన వారు 2,740	నిరుద్యోగులకు శిక్షణ ఇస్తున్న కేంద్రాలు 8
ఉద్యోగాలు పొందిన యువత 1,940	జాబ్‌మేళాల్లో ఉద్యోగాలకు ఎంపికైన వారు 3,646 మంది

నెల్లూరు(పొగతోట): జిల్లాలోని నిరుద్యోగులకు ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించేలా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నిరుద్యోగులను గుర్తించి వారికి విద్యార్హతల ఆధారంగా వివిధ రంగాల్లో శిక్షణ ఇస్తున్నారు. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్య యోజన(డీడీయూజీకేవై), సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్(సీడాప్) ద్వారా నిరుద్యోగులకు పలు అంశాల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 18 నుంచి 35 సంవత్సరాల వయసు లోపు ఉన్న యువతకు శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు. జిల్లాలో 10, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, ఎంబీఏ, బీటెక్ పూర్తి చేసిన వారు 3.50 లక్షల మందికి పైగా ఉన్నారు. ప్రస్తుతం నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చేందుకు జిల్లాలో నియోజకవర్గానికి ఒకటి చొప్పున 8 శిక్షణ కేంద్రాలు ఉండగా, 600 మంది నిరుద్యోగులు శిక్షణ పొందుతున్నారు. శిక్షణ సమయంలో ఉచిత వసతి, భోజన సౌకర్యాలు కల్పిస్తున్నారు. 2019 నుంచి ఇప్పటివరకు 2,740 మంది నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చారు. వారిలో 1,940 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారు. జాబ్‌మేళాలు నిర్వహించి 3,646 మందికి వివిధ పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించారు. జిల్లాలో ఉన్న పరిశ్రమల్లో ఉద్యోగాలు పొందేలా అవసరమైన శిక్షణ ఇచ్చేందుకు జిల్లా యంత్రాంగం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. డీఆర్‌డీఏ అధికారులు 10, ఇంటర్, డిగ్రీ, ఎంబీఏ, బీటెక్ తదితర కోర్సులు పూర్తి చేసిన వారి వివరాలు సేకరిస్తున్నారు. డీఆర్‌డీఏ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాల నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు.

స్థానికులకు ప్రాధాన్యం

జిల్లాలో కృష్ణపట్నంపోర్టు, శ్రీసిటీతోపాటు అనేక పవర్ ప్రాజెక్టులు ఉన్నాయి. కోవిడ్–19 నేపథ్యంలో అధిక శాతం మంది కార్మికులు వారి స్వగ్రామాలకు వెళ్లిపోయారు. ప్రస్తుతం పరిశ్రమల్లో కార్మికుల కొరత అధికంగా ఉంది. వృత్తినైపుణ్యం కలిగిన కార్మికుల అవసరం ఉంది. జిల్లాలోని పరిశ్రమల్లో స్థానిక యువతకు 75 శాతం ఉద్యోగాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చట్టాన్ని తీసుకువచ్చిన నేపథ్యంలో దానిని అమలు చేసేలా అధికారులు చర్యలు చేపట్టారు. కాగా నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చేందుకు జిల్లాలో 8 స్కిల్ హబ్స్, ఒక స్కిల్ కాలేజీ అందుబాటులో ఉన్నాయి. ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్ పూర్తి చేసిన వారికి విద్యార్హత ఆధారంగా ఈ కేంద్రాల్లో శిక్షణ ఇస్తున్నారు. జిల్లాలోనే కాకుండా ఇతర రాష్ట్రాల్లోని భారీ పరిశ్రమల్లో కూడా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు.

యువతకు శిక్షణ



నెల్లూరులో జాబ్‌మేళాలో నిరుద్యోగులతో మాట్లాడుతున్న పీడీ సాంబశివారెడ్డి(ఫైల్)

సీఆర్‌ఎం డొమెస్టిక్ నాన్–వాయిస్, మెడికల్ ఎక్విప్‌మెంట్ టెక్నీషియన్(బేసిక్ క్లినికల్ ఎక్విప్‌మెంట్), ఫీల్డ్ టెక్నీషియన్–కంప్యూటింగ్, పెరిఫెరల్స్, ఆటోమోటివ్ సర్వీస్ టెక్నీషియన్, మల్టీస్కిల్ టెక్నీషియన్, టూర్ మేనేజర్, ఈవెంట్ మీటింగ్ కాన్ఫరెన్స్ ప్లానర్, ఫెసిలిటీ మేనేజర్ తదితర అంశాల్లో యువతకు శిక్షణ ఇస్తున్నారు. 3, 6, 12 నెలలపాటు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శిక్షణ సమయంలో యూనిఫాం ఇస్తున్నారు. శిక్షణ పూర్తి చేసిన వారికి మెటీరియల్, ఎన్‌ఎస్‌డీసీ సర్టిఫికెట్ అందజేస్తున్నారు.

ఉద్యోగం కల్పించారు



దరఖాస్తు చేసుకున్న అనంతరం నెల్లూరులో శిక్షణ పూర్తి చేసుకున్న వెంటనే ఉద్యోగ అవకాశం కల్పించారు. శిక్షణ సమయంలో ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పించారు. శిక్షణ వల్ల నా భవిష్యత్‌కు భరోసా ఏర్పడింది. ప్రస్తుతం ఆత్మకూరులో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నా. ఉద్యోగం అవకాశం కల్పించిన సిడాప్‌కు కృతజ్ఞతలు.

– సీహెచ్ శ్రీవిద్య, ఆత్మకూరు

సంతోషంగా ఉంది



నేను ఇంటర్ పూర్తి చేసి అనంతరం సిడాప్ ద్వారా నెల్లూరు శిక్షణ తీసుకున్నాను. అనంతరం ఉద్యోగ అవకాశం కల్పించారు. శిక్షణ సమయంలో యూనిఫాం ఇచ్చారు. శిక్షణ పూర్తయ్యాక సర్టిఫికెట్ అందజేయడంతోపాటు నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు. ప్రస్తుతం నెల్లూరులో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నా.

– బి.గురునాథ్, విడవలూరు

సద్వినియోగం చేసుకోవాలి



సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ ఎంటర్‌ప్రైజెజ్ డెవలప్‌మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్(సిడాప్), స్కిల్ డెవలప్‌మెంట్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఇన్నోవేషన్, ఏపీ ప్రభుత్వం, దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్య యోజన(డీడీయూ–జీకేవై) ద్వారా నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాం.క్రమం తప్పకుండా జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నాం. నిరుద్యోగులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి.

– సాంబశివారెడ్డి, పీడీ, డీఆర్‌డీఏ

అర్జీలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు



అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ చక్రధర్‌బాబు

నెల్లూరు(అర్బన్): స్పందన కార్యక్రమంలో ప్రజలు అందించే అర్జీలపై ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో జరిగిన స్పందన కార్యక్రమానికి జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చి తమ సమస్యలపై అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఒకే అంశంపై మళ్లీమళ్లీ అర్జీలు రావడం ఏంటని అధికారులను ప్రశ్నించారు. అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలన్నారు. పరిష్కరించలేని పక్షంలో సంబంధిత అర్జీదారులను పిలిచి ఎందుకు పరిష్కరించలేకపోతున్నామో సహేతుక కారణాలు తెలపాలని సూచించారు. కోర్టు కేసులపై అశ్రద్ధ తగదని, సకాలంలో కౌంటర్లు, రిట్ పిటిషన్లు వేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ కూర్మనాథ్, డీఆర్వో వెంకటనారాయణమ్మ, జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, డ్వామా పీడీ వెంకట్రావ్, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు, గృహ నిర్మాణ సంస్థ పీడీ వెంకటదాసు, జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

విష గుళికలు తిని వ్యక్తి ఆత్మహత్య

అల్లూరు: విష గుళికలు తిని ఓ వ్యక్తి ఆత్మహత్యకు ప్రయత్నించి చికిత్సపొందుతూ మృతిచెందిన ఘటన అల్లూరు మండలంలోని బీరంగుంట గ్రామంలో ఇటుక బట్టీల వద్ద సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై పి.శ్రీనివాసులురెడ్డి వివరాల మేరకు గిరిజనుడు ఇనమాల లక్ష్మయ్య(65) దాదాపు 8 ఏళ్లుగా బీరంగుంట ఇటుక బట్టీల వద్ద కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం 11 గంటల సమయంలో ఇటుక బట్టీల వద్ద విష గుళికలు తిని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. స్థానికులు గమనించి అతనిని చికిత్సనిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ చికిత్సపొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వేసవి క్రీడా శిక్షణ శిబిరాలకు దరఖాస్తులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లాలో వివిధ క్రీడాంశాల్లో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించేందుకు వ్యాయామ విద్య ఉపాధ్యాయులు, క్రీడా శిక్షకులు, సీనియర్ క్రీడాకారులు, గుర్తింపు పొందిన జిల్లా క్రీడా సంఘాల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెట్నెల్ సీఈఓ డి.పుల్లయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే ఒకటో తేదీ నుంచి 31వ తేదీ వరకు క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఆసక్తి గల వారు ఏప్రిల్ 5వ తేదీ లోపు http:// tiny. cc/scc&2023 వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయంలో, 88862 28444 ఫోన్‌నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి: రూ. 70
సన్నవి: రూ. 60
పండ్లు: రూ. 25

గొర్రెలను అపహరించేందుకు వచ్చి..

- గ్రామస్తులకు చిక్కిన దుండగులు

మర్రిపాడు: మండలంలోని సన్నువారిపల్లి గ్రామ సమీపంలో గొర్రెల దొంగతనం కోసం వచ్చిన వ్యక్తులను గ్రామస్తులు అనుమానించి పట్టుకున్న ఘటన సోమవారం చోటుచేసుకుంది. గ్రామంలో ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతుండగా శ్రీనివాసులు అనే రైతుకు అనుమానం వచ్చి మీరెవరని ప్రశ్నించడంతో వారు పరారయ్యేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో గ్రామస్తులు ముగ్గురిని వెంబడించి వారిలో ఇద్దరిని పట్టుకున్నారు. ఓ వ్యక్తి పరారయ్యాడు. పట్టుకున్న ఇద్దరిని మర్రిపాడు పోలీసులకు అప్పగించారు. వారు సంగం మండలానికి చెందిన వ్యక్తులుగా తెలుస్తోంది. వారి వద్ద నుంచి ఒక ద్విచక్ర వాహనాన్ని కూడా స్వాధీనం చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఇరువురిని మర్రిపాడు పోలీసులు విచారిస్తున్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	:124
లేయర్ (లైవ్)	:75
బ్రాయిలర్ చికెన్	:216
బ్రాయిలర్ స్కిన్‌లెస్	:240
లేయర్ చికెన్	:128

మహిళ కడుపులో 6 కిలోల కణితి

- శస్త్రచికిత్స చేసి తొలగించిన మెడికవర్ వైద్యులు



శస్త్రచికిత్స చేసి తొలగించిన కణితి

నెల్లూరు(అర్బన్): కడుపు నొప్పి, ఉబ్బసం సమస్యతో తీవ్రంగా బాధపడుతూ తమ ఆస్పత్రికి వచ్చిన నెల్లూరుకు చెందిన అలివేలమ్మకు అరుదైన శస్త్రచికిత్స చేసి ఆమె కడుపులో నుంచి 6 కిలోల కణితిని తొలగించామని మెడికవర్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ అవినాష్ తెలిపారు. ఆపరేషన్‌ను ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఆరోగ్యశ్రీ పథకం ద్వారా చేశామని తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆస్పత్రిలో రోగి అలివేలమ్మతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అలివేలమ్మ గత మూడు నెలలుగా కడుపునొప్పితో బాధపడుతూ తమ ఆస్పత్రికి వచ్చిందని, సిటి స్కాన్ చేయగా గర్భాశయంలో 6 కిలోల కణితి ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. రోగి కుటుంబసభ్యులకు పరిస్థితిని విన్నవించి వారి అంగీకారంతో శస్త్రచికిత్స చేశామని తెలిపారు. ప్రస్తుతం రోగి పూర్తిగా కోలుకుందని, డిశ్చార్జ్ చేస్తున్నామన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

నెల్లూరు(అర్బన్): జిల్లాలో సోమవారం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఫిజిక్స్– 2, ఎకనామిక్స్–2 పరీక్షలు జరగ్గా జనరల్ విద్యార్థులు 24,798 మందికి గానూ 24,174 మంది హాజరయ్యారు. 624 మంది గైర్హాజరయ్యారు. అలాగే ఒకేషనల్ విద్యార్థులు 1,689 మందికి గానూ 1,573 మంది హాజరయ్యారు. 116 మంది హాజరు కాలేదు. ఆర్ఐఓ వరప్రసాద్, పరిశీలకులు మధుబాబు, ఇతర పరీక్షల కమిటీ సభ్యులు 71 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ పరిశీలకుల బృందం మరికొన్ని కేంద్రాలను తనిఖీ చేసింది.

నిర్వాసితులకు అండగా ఉంటాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి

గుడ్లూరు: రామాయపట్నం పోర్టు నిర్మాణానికి భూములు ఇచ్చిన మూడు గ్రామాల ప్రజలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని, నిర్వాసితులకు అందాల్సిన పునరావాస ప్యాకేజీ, నష్టపరిహారం పూర్తిస్థాయిలో అందిస్తున్నామని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి తెలిపారు. తెట్టు–రామాయపట్నం గ్రామాల మధ్య ఆర్‌ఆర్ కాలనీలో పోర్టు నిర్వాసిత గ్రామమైన ఆవులవారిపాళెం గ్రామస్తులకు నిర్మిస్తున్న గృహాల భూమిపూజ కార్యక్రమంలో సోమవారం ఎమ్మెల్యేతోపాటు కందుకూరు సబ్ కలెక్టర్ శోభిక పాల్గొన్నారు. భూమిపూజలో పాల్గొన్న అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రామాయపట్నం పోర్టు నిర్మాణానికి భూములతోపాటు గృహాలు కోల్పోయిన మొండివారిపాళెం, ఆవులవారిపాళెం, కర్లపాళెం గ్రామస్తులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద పునరావాసంతోపాటు నష్టపరిహారాన్ని ప్రభుత్వం అందిస్తుందన్నారు. మొండివారిపాళెం గ్రామస్తులకు ఇళ్ల నిర్మాణం జరుగుతోందని, ఆవులవారిపాళెం గ్రామస్తులు కూడా నిర్మాణ పనులు ప్రారంభించాలని తెలిపారు. పోర్టు ఏర్పాటుతో ఈ ప్రాంతం పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందుతుందన్నారు. పోర్టుకు భూములు, గృహాలు ఇచ్చిన వారి మేలును ఎప్పటికీ మరువలేమన్నారు. తెట్టు నుంచి పోర్టు వరకు రోడ్డును 80 అడుగులు విస్తరించేలా ప్రతిపాదనలు పంపామన్నారు.

అలాగే జాతీయ రహదారి నుంచి కరేడు మీదుగా, తీరప్రాంత గ్రామాల మీదుగా 'సాగరమాల' పథకం కింద పోర్టు వరకు రహదారి నిర్మాణానికి కూడా ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. జీవనభృతి కోల్పోయిన మత్స్యకారులకు వేట ద్వారా జీవనభృతిని కల్పించడానికి చర్యలు జరుగుతున్నాయన్నారు. సబ్ కలెక్టర్ శోభిక మాట్లాడుతూ ఆవులవారిపాళెం గ్రామానికి చెందిన 110 కుటుంబాల వారికి ఆర్‌ఆర్ కాలనీలో గృహాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. వారికి ఒక్కొక్కరికి రూ.9.90 లక్షలు అందిస్తామన్నారు. మూడు రోజుల్లో వారికి నగదు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పోర్టు ఎండీ ప్రతాప్‌రెడ్డి, లైజనింగ్ ఆఫీసర్ ఐవీ రెడ్డి, తహసీల్దార్ సూర్యనారాయణ సింగ్, సర్పంచ్‌లు చాపల రమణయ్య, గంగమ్మ, మత్స్యకార నాయకులు సుధాకర్ పాల్గొన్నారు.